ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 343 మంగళవారం 10-12-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





- తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లు
- డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజు
- తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టం
- గతంలో ఒక పార్టీ తమ కుటుంబం కోసమే ఆలోచించింది
- కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నాది
- పదేళ్లలో బీఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చింది
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'టీజీ'గా 'టీఎస్'
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- అందెశ్రీని సన్మానించిన సీఎం రేవంత్ రెడ్డి

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం హైదరాబాదులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 20 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వేదమంత్రాల సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గేయ రచయిత అందెశ్రీని సీఎం సన్మానించారు. గుండుపూసలు, హారం, ముక్కుపుడక, ఆకుపచ్చ చీర, కడియాలు, మెట్టెలతో పాటు చాకలి ఐలమ్మ, సమ్మక్క-సారక్క పోరాట స్ఫూర్తితో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. వరి, జొన్న, సజ్జలు, మొక్కజొన్న కంకులు తెలంగాణ తల్లి చేతిలో పొందుపరిచారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. సచివాలయం, ట్యాంక్ బండ్ పరిసరాలు జనసముద్రంగా మారాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని అన్నారు. సోనియా జన్మదినం రోజే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రకటన వచ్చిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చేందుకు అంతా కలిసి పోరాడామని అన్నారు. కాంగ్రెస్ వచ్చాక తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ లభించిందన్నారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఇష్టమైన రోజని, కృష్ణా, గోదావరి నదులు హైదరాబాద్‌లో ప్రవహించినట్లు ఉందన్నారు. ఈరోజు తెలంగాణ తల్లిని ప్రతిష్ఠించుకోవడం మన అదృష్టమని, తెలంగాణ వారికి ఎన్నో అవమానాలు ఎదురయ్యాయని అన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందన్నారు. గతంలో ఒక పార్టీ కేవలం తమ కుటుంబం కోసమే ఆలోచించిందని, మా పార్టీ మాత్రం ప్రజల కోసం ఆలోచిస్తుందన్నారు. యావత్ తెలంగాణ మొత్తం పండగ చేసుకునే పర్వదినం డిసెంబర్ 9గా అభివర్ణించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టి మొదటి ఏడాదిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుందని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రం సమయంలో తెలంగాణ సంస్కృతిని అవహేళన చేశారని, నేడు మన సంస్కృతి సాంప్రదాయాలు చాటి చెప్పేలా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. గత పాలకులు కుటుంబం గురించి ఆలోచించారే కానీ యావత్ తెలంగాణ గర్వించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలన్న ఆలోచనకు నోచుకోలేదంటూ బీఆర్ఎస్ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. తాను తెలంగాణ తల్లిని చూసిన సమయంలో తన తల్లిని చూసిన భావన కలిగిందని, అదే భావన యావత్ తెలంగాణ కలిగే విధంగా తెలంగాణ తల్లిని రూపొందించినట్లు తెలిపారు. తెలంగాణ అంటేనే కవులు, కళాకారులకు పుట్టినిల్లని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తాము 'టీఎస్'ను 'టీజీ'గా మార్చామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఉన్న రోజుల్లో అందరూ 'టీజీ' అని రాసుకున్నారని గుర్తు చేశారు. కానీ గత ప్రభుత్వం 'టీఎస్' అని తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్రతిచోట 'జయ జయహే తెలంగాణ' వినిపించేదని, కానీ రాష్ట్రం వచ్చాక ఆ గేయానికి గౌరవం దక్కలేదని విమర్శించారు. అందుకే తాము ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించామన్నారు. తెలంగాణ పదేళ్ల పాటు వివక్షకు గురైందన్నారు. ఎందరో కవులు, కళాకారులు ఉద్యమానికి ఊపిరిలూదారని, వారిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని తాము సంక్షేమం వైపు నడిపిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఎందరో కవులు, కళాకారులు, రచయితలు వారి పాటలతో యావత్ తెలంగాణ యువతను చైతన్యపరిచి ఉద్యమం వైపు సాగించడంతోనే తెలంగాణ సాధ్యమైందని సీఎం అన్నారు.

# పార్లమెంట్ ఎదుట ఎంపీల ఆందోళన

**అదానీ ఫొటోలతో రాహుల్ నిరసన**




**న్యూఢిల్లీ, డిసెంబర్9:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అదానీ వ్యవహారంపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా విపక్ష ఎంపీలంతా నిరసనకు దిగారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలకు తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు హాజరుకాలేదు. కాగా, కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారు 24 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. 'ఎన్నికల్లో విజయం సాధించి పెట్టలేని నాయకుడిని మనం ఇంకా ఎంతకాలం భరించాలి' అన్న ధోరణి ఆ పార్టీల్లో ఇటీవల అధికమైంది. ముఖ్యంగా శివసేన (యూబీటీ), టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీలు శనివారం మమత చేసిన ప్రకటనపై స్పందించాయి. పరోక్షంగా ఆమెకు మద్దతు తెలిపి, కూటమిలో నాయకత్వ మార్పు చేపట్టాలన్న సంకేతాలు ఇచ్చాయి. దానికి తోడు ఇటీవల జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో కూటమి పరాజయం, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఒకే అంశం(అదానీ అవినీతి)పై కాంగ్రెస్ కేంద్రాన్ని నిలదీయడం, అధికార పార్టీ సభను వాయిదా వేయడం తదితర అంశాలు కూటమిలోని మిగతా పార్టీలకు ఏమాత్రం రుచించడం లేదు. దీంతో కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్‌ను తప్పించాలని కొన్ని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి.

## రెండో జాబితాను విడుదల చేసిన ఆప్‌పార్టీ

**న్యూఢిల్లీ, డిసెంబర్9:** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే 11 మందితో తొలి జాబితాను రిలీజ్ చేసిన అధికార ఆప్.. తాజాగా 20 మంది అభ్యర్థులతో రెండో జాబితాను కూడా విడుదల చేసింది. ఇక ఈ లిస్ట్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పేరు ఉంది. ఆయన ఈసారి పట్పర్‌గంజ్ అసెంబ్లీ స్థానం నుంచి కాకుండా.. జంగ్‌పురా నుంచి బరిలోకి దిగనున్నారు. ఇక ఇటీవలే ఆప్‌లో చేరిన ఉపాధ్యాయుడు అవధ్ ఓజాకు పట్పర్‌గంజ్ స్థానాన్ని కేటాయించారు. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70 స్థానాలు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 70 స్థానాల్లో 62 స్థానాలను గెలుచుకున్న విషయం తెలిసిందే.

# తెలుగు సబ్జెక్ట్ తప్పనిసరేం కాదు

- 9, 10 తరగతుల సిలబస్ లో స్వల్ప మార్పు
- నిబంధనను 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

**తొలి సమయం హైదరాబాద్,డిసెంబర్9** 10 తరగతి మినహా మిగతా బోర్డులకు సంబంధించిన పాఠశాలల్లో తెలుగు సబ్జెక్టు తప్పనిసరిగా అమలు చేయాలనే నిబంధనను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఈ నిబంధనను కేవలం 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేయాలని, 9, 10 తరగతులకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.. తెలంగాణ రాష్ట్రంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు రాష్ట్ర సర్కార్ కీలక అప్‌డేట్ జారీ చేసింది. ప్రస్తుత (2024-25), వచ్చే విద్యా సంవత్సరం (2025-26) తొమ్మిదవ, పదో తరగతి చదివే విద్యార్థులు తెలుగును ఒక సబ్జెక్టుగా చదవడంపై మినహాయింపునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి వరకు పాఠశాల విద్యార్థులు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా చేస్తూ చట్టం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ చట్టం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఇతర బోర్డుల్లో 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే అమలు చేస్తున్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు చదవడం లేదు. కేవలం ఐదు సబ్జెక్టులే చదువుతున్నారు. భాషా సబ్జెక్టుల్లో ఆంగ్లం, హిందీ మాత్రమే వీరంతా అభ్యసిస్తున్నారు. ఇతర బోర్డుల్లో తెలుగు మాతృభాష కానివారు కూడా అధిక సంఖ్యలో ఉండటమే ఇందుకు కారణం. దీంతో ఆ సబ్జెక్టులో తప్పనిసరిగా పాస్ కావాలంటే ఇబ్బందులు వస్తాయని భావించిన విద్యాశాఖ 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు అమలును మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) 2025 ఫలితాలు విడుదలైన సంగతి తెలిసిందే. పరీక్ష రాసిన అభ్యర్థులు అప్లికేషన్ లేదా అడ్మిట్ కార్డు నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి స్కోరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశ వ్యాప్తంగా 141 పరీక్ష కేంద్రాల్లో డిసెంబర్ 1వ తేదీన క్లాట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు డిసెంబర్ 9న అందుబాటులో రానున్నాయి.

# దొంగలతో రేవంత్ దోస్తీ

- అసెంబ్లీకి వెళ్తే అడుకోవల్సిన అవసరం ఏమిటి
- రాహుల్ గాంధీ అదానీని వ్యతిరేకిస్తే
- ప్రాణాలకు తెగించి రాష్ట్రం సాధించిన మహోన్నతుడు కేసీఆర్
- రేవంత్ సపోర్టు చేస్తాడా..?
- అసెంబ్లీలో రేవంత్ అక్రమాలను ఎండగడతాం : మాజీ మంత్రి కేటీఆర్

**తొలి సమయం హైదరాబాద్, డిసెంబర్9 :** దొంగలతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ చేస్తున్నాడని, అదానీ, రేవంత్ రెడ్డి ఒక్కటై తెలంగాణ ప్రజాలతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదానీ పట్ల కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. అదానీ, రేవంత్ దోస్తానాను శాసనసభ వేదికగా ఎండగడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరులకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. అమరులకు జోహార్.. వీరులకు జోహార్ అంటూ పాటపాడారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. "రాష్ట్ర సాధనలో భాగంగా పదవీ త్యాగంతో బీఆర్ఎస్ పార్టీ ప్రారంభమైందన్నారు. ప్రాణ త్యాగానికి కూడా సిద్ధపడిన తెలంగాణ మహానాయకుడు కేసీఆర్ అని అన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్ దీక్షకు దిగి దేశ రాజకీయ వ్యవస్థను మెడలు వంచిన రోజు, తెలంగాణ ప్రజా కదలికలతో ఢిల్లీ పాలకుల గుండెల్లో గుబులు పుట్టినరోజు డిసెంబర్ 9. దీక్ష ఫలవంతమైన డిసెంబర్ 9న దీక్షా విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అమరులకు ఘనంగా నివాళులు అర్పించామని, కాంగ్రెస్ పార్టీ చేసిన దుర్మార్గపు ఆలోచనను ప్రజలకు వివరిస్తామన తెలిపారు. దేశ వ్యాప్తంగా అదానీ మంచివాడు కాదని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నదని, కానీ రాష్ట్రంలో మాత్రం అదానీతో రేవంత్ రెడ్డి అలయ్ బలయ్ తీసుకుంటున్నాడని ఆరోపించారు. రాహుల్




గాంధీ అదానీపై ఇతర రాష్ట్రాల్లో దుర్మార్గపు ప్రచారం చేస్తుంటే ఇక్కడమాత్రం మంచివాడని అన్నట్లుగా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అదానీ, రేవంత్ ఒక్కటై తెలంగాణ ప్రజానికంతో ఆడుతున్న నాటకాన్ని బయటపెడతామనన్నారు. గురుకుల, లగచర్లలో గిరిజనుల నుంచి బలవంతంగా భూములు లాక్కొంటున్న విధానాన్ని, రైతన్నల సమస్యలు, నెరవేరని గ్యారంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిన విధానాన్ని, రాష్ట్రంలో నెలకొన్న ప్రతి సమస్యను అసెంబ్లీలో చర్చకు పట్టుబడతామని తెలిపారు. తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడిని, ముఖ్యంగా తెలంగాణ తల్లిని మారుస్తానంటున్న రేవంత్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనను నిరసిస్తూ తెలంగాణ ప్రజల ఆర్తిని రెండు సభల్లో వినిపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు.

# విగ్రహంపై కావాలనే కొందరు రాజకీయం

**పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్**

**తొలి సమయం హైదరాబాద్,డిసెంబర్9:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని కావాలనే కొందరు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్. తెలంగాణ తల్లి విగ్రహం.. అచ్చం తెలంగాణ ఆడపడుచు, తల్లి మాదిరిగా ఉందన్నారు. నిజమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఉందన్నారు. దయచేసి దీన్ని రాజకీయం చేయవద్దని సూచన చేశారు. రూపుదిద్దుకున్న తెలంగాణ విగ్రహం శాశ్వతంగా ఉండేలా అవసరమైతే చట్టం తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు తెలంగాణకు సోమవారం (డిసెంబర్ 9) ప్రత్యేకమైన రోజుగా వర్ణించారు టీపీసీసీ చీఫ్. ఒకటి పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం రోజు, 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభించిన రోజుగా ఇదేనని గుర్తు చేశారు. తెలంగాణలో ఇవాళ చరిత్రాత్మకమైన రోజుగా వర్ణించారు. రాష్ట్ర ప్రజల తరపున సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శానసమండలి ఆవరణంలో మీడియాతో మాట్లాడారాయన. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహానికి మద్దతు తెలుపుతున్నామని తెలిపారు. వాస్తవాలు ప్రతిబింబించే విధంగా విగ్రహాలు రూపకల్పన చేయడం బాగుందన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా విగ్రహం ఉంది. ముమ్మాటికీ తెలంగాణ సంస్కృతికి దర్పణం పడుతుందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి శిల్పి, తెలంగాణ ప్రకృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ రూపం మార్చకూడదు, అలా చేస్తే ప్రాముఖ్యత కోల్పోతుందన్నారు. టీఎస్ కంటే%% టీజీ బాగుందని వెల్లడించారు.మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహంలో హస్తం ఆశీర్వదిస్తుందనే భావించాలన్నారు. సోనియాగాంధీ బర్త్ డే నాడు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాలని అప్పట్లో పార్లమెంట్‌లో కోరామని గుర్తు చేశారు.

# ఐసిస్ శిబిరాలపై అమెరికా దాడులు

- అధికారికంగా ప్రకటించిన అమెరికా
- ఐసిస్ మళ్లీ బలపడకుండా దాడి చేశామన్న జో బైడెన్
- సిరియాలో అనూహ్య పరిణామాలు
- సిరియా పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న భారత్

సిరియాలో అనూహ్యమైన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. తిరుగుబాటు దళాలు రాజధాని డమాస్కస్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంతో ఆ దేశ అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ కుటుంబాన్ని తీసుకొని రష్యాకు పారిపోయినట్టుగా కథనాలు వెలువడుతున్నాయి. దీంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ పాలనకు ముగింపు పడింది. కాగా సిరియాలో అంతర్యుద్ధం పరిస్థితులను అదునుగా భావించిన అగ్రరాజ్యం అమెరికా ఉగ్రవాద సంస్థ ఐసిస్ స్థావరాలపై దాడులు మొదలు పెట్టింది. అస్సాద్ రష్యాకు పారిపోయిన కొన్ని గంటల వ్యవధిలోనే ఐసిస్ లక్ష్యాలపై ఆదివారం డజన్ల కొద్దీ దాడులు చేసింది. దేశంలో నెలకొన్న అంతర్యుద్ధ పరిస్థితులను అవకాశంగా మలచుకొని తిరిగి బలపడాలని ఐసిస్ చూస్తోందని, తాము అలా జరగనివ్వబోమని, 'స్పష్టమైన ఆలోచన'తో ఐసిస్ లక్ష్యాలపై దాడులు జరిపామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ మేరకు అధ్యక్ష భవనం నుంచి ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా ఐసిస్ స్థావరాలపై ఆదివారం దాడులు జరిపామని, తమ యుద్ధ విమానాలు డజన్ల కొద్దీ శిబిరాలను తాకాయని యూఎస్ మిలిటరీ నిర్ధారించింది. బీ-52, ఎఫ్-15, ఏ-10తో పాటు యూఎస్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన విమానాలను ఉపయోగించి సెంట్రల్ సిరియాలోని 75కు పైగా లక్ష్యాలపై దాడులు చేశామని అధికారిక ప్రకటనలో పేర్కొంది. కాగా సిరియాలో అధ్యక్షుడు అస్సాద్ పాలన పతనమవ్వడం న్యాయమేనని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ వ్యాఖ్యానించారు.దీర్ఘకాలంగా బాధపడుతున్న సిరియా ప్రజలకు ఇది చారిత్రాత్మక అవకాశమని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు బషర్ అల్ అస్సాద్, అతడి కుటుంబం రష్యా పారిపోయి అక్కడ ఆశ్రయం పొందినట్లు కథనాలు వెలువడుతున్నాయి. కాగా గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న అస్సాద్ కుటుంబ పాలనపై ఇస్లామిస్ట్ హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) అనే గ్రూపు మెరుపు దాడికి తెగబడింది. అమెరికా మద్దతున్న ఈ గ్రూపు దళాలు 11 రోజుల్లోనే సిరియాను తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. మరోవైపు పశ్చిమాసియాలో ఎప్పటి నుంచో సంక్షుభిత పరిస్థితులు ఉన్న దేశాల్లో సిరియా ఒకటి. సుదీర్ఘకాలంగా ఇక్కడ అంతర్యుద్ధం నడుస్తోంది. తిరుగుబాటుదారులకు భయపడి దేశాధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి రష్యాకు పారిపోవడం సిరియాలో నెలకొన్న సంక్షోభానికి పరాకాష్ఠ. అంతర్జాతీయ సమాజం సిరియా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తోంది. తాజాగా, సిరియా అంశంపై భారత కేంద్ర ప్రభుత్వం స్పందించింది. సిరియాలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. సిరియాలో మళ్లీ స్థిరత్వం నెలకొనాలని కోరుకుంటున్నామని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.

# ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు





**తొలి సమయం కరీంనగర్ డిసెంబర్ 09**
సోమవారం మండల కేంద్రంలో ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండల నాయకులు కేకు కట్ చేసి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంత సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ బిడ్డలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తల్లి సోనియా గాంధీ అని,సోనియా గాంధీ ఆదేశానుసారం ప్రజలకు ఇచ్చిన హామీలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి రవాణ,బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లను గెలిపించి కాంగ్రెస్ పార్టీని నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు,రాష్ట్ర సంక్షేమ పథకాలు,రైతన్నలను రుణ విముక్తులు చేశామని అన్నారు.సోనియాగాంధీ జన్మదినము తెలంగాణ ప్రజలకు పండగనీ సోనియా గాంధీ లేనిదే తెలంగాణ లేదని, ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన ఆమె జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్,ఊసకోయిల రాఘవులు,మిట్టపెల్లి కిష్టయ్య ,మేకల రవీందర్, కూతురు విద్వాన్ రెడ్డి, బొమ్మగాని రాజు,న్యాదండ్ల రాజ్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఏర్రల శ్రీనివాస్, తాళ్ళపెల్లి వెంకటేశం, లంకదాసరి మల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షులు గొల్లపల్లి యాదగిరి,వెల్డి రాజు,బానోతు కిషన్ నాయక్,నిర్ల వెంకట్రజం, మునిగంటి సంతోష్,అనగోని శ్రీనివాస్,మేకల రాజు,వేముల శ్రీనివాస్,జంపాల చంద్రయ్య, గోపిరాజు సమ్మయ్య,గున్నాల కృష్ణమూర్తి,గొల్లపల్లి రాజయ్య, గొల్లపల్లి గోపాల్ ,యూత్ కాంగ్రెస్ నాయకులు బోనగిరి అనిల్,బానోతు తిరుపతి నాయక్,మడెపు రాహూల్, బొడిగే చంద్రమొగిలి,వేముల సునీల్, ఎన్.ఎస్.యు.ఐ మండల ఉపాధ్యక్షులు తలారి రోషన్,నాయకులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : అదనపు కలెక్టర్ వెంకట రెడ్డి



**హన్మకొండ /డిసెంబర్ 09**
వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల సత్వర పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 88 అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, డిఆర్డీవో మేన శ్రీను, హన్మకొండ, పరకాల ఆర్డీఓ లు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ ఇతర జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు మావోయిస్టులు అరెస్ట్



**తొలి సమయం చర్ల/డిసెంబర్ 09**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మా జిల్లా ఫుల్బగాడి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఇద్దరు నక్సలైట్లను అరెస్ట్ చేయడంలో జరిగింది . అరెస్టయిన నక్సలైట్ల నుంచి భద్రతా బలగాలకు హాని కలిగించే ఉద్దేశంతో దాచి ఉంచిన పేలుడు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నక్సలైట్‌లను అరెస్టు చేయడంలో ఫుల్‌బాగ్రీ పోలీస్ స్టేషన్ మరియు డి ఆర్ జి సంయుక్త చర్య తీసుకున్నారు. సుక్మా జిల్లాలో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో నక్సల్ నిర్మూలన ప్రచారం నిర్వహిస్తున్నారు, అదే క్రమంలో, నక్సలైట్లు ఉన్నారనే సమాచారంతో శనివారం , పోలీసుల నుండి బార్సెట్టి మరియు పరిసర ప్రాంతాలకు జిల్లా బలగాల బృందం బయలుదేరింది. ఫూల్‌బగాడి స్టేషన్ ఆపరేషన్ సమయంలో, కర్కపర గ్రామం బడేసట్టి బుర్దాపర మధ్య డ్రెయిన్ సమీపంలోని అడవిలో ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులను పోలీసులు గుర్తించారు. ఇది చూసిన వారు దాక్కుని పారిపోవడం ప్రారంభించారు, కానీ భద్రతా దళాలు చుట్టుముట్టి పట్టుకున్నారు. పట్టుబడిన నిందితులను విచారించగా వారి పేర్లు వరుసగా వెల్లడి: మద్వి మంగ, తండ్రి మద్వి పాండు, వయస్సు సుమారు 40 సంవత్సరాలు, గ్రామం ములేర్, పటేల్‌పర పోలీస్ స్టేషన్ ఫుల్‌బాగ్డి రెవెన్యూ జిల్లా దంతేవాడ, మద్వి భీమారం తండ్రి మద్వి రామ, వయస్సు 21 సంవత్సరాలు, గ్రామం. ములేర్ పటేల్‌పారా పోలీస్ స్టేషన్ ఫుల్‌బాగ్డి రెవెన్యూ జిల్లా దంతేవాడలో నక్సల్ సంస్థలో సభ్యుడు మరియు కేరళపాల్ ఏరియా కమిటీ కింద ముల్లెర్ ఆర్‌పిసిలో ఉన్నారు. మిలీషియా సభ్యునిగా పని చేయడం గురించి వివరించండి. కఠిన విచారణ అనంతరం, పట్టుబడిన నిందితుల నుంచి సుమారు 05 కిలోల టిఫిన్ బాంబులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 18 మీటర్ల ఎలక్ట్రిక్ వైర్, ఎలక్ట్రిక్ డిటోనేటర్ రెండు , జెలటిన్ రాడ్ మూడు , బ్యాగ్ ఒకటి , నక్సల్ కరపత్రాలు ఆరు స్వాధీనం చేసుకున్నారు. ఈ సామాగ్రిని దాచి ఉంచడంపై ప్రశ్నించగా, హాని కలిగించే ఉద్దేశ్యంతో భద్రతా బలగాలు వెళ్లే మార్గాల్లో వాటిని దాచినట్లు తెలిసింది. ఇది చట్టవిరుద్ధం అని తేలినందున, నక్సలైట్లిద్దరిపై క్రైమ్ నంబర్ 07/2024, పేలుడు పదార్థాల చట్టంలోని సెక్షన్ 4, 5 కింద ఫుల్‌బాగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఆదివారం వీరిని అరెస్టు చేసి, న్యాయ విచారణ నిమిత్తం న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌పై జైలుకు పంపారు.

## జాతీయ స్థాయి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పురస్కారం అందుకున్న ఇర్ప. బాలాజీ

**తొలి సమయం వాజేడు, డిసెంబర్ 09**
ఢిల్లీ లోని పంచాశిలా కళవేదికలో జరిగిన జాతీయ స్థాయి డాక్టర్ బి అర్ అంబేద్కర్ పురస్కారం దళిత సంక్షేమ ఆల్ ఇండియన్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా అవార్డు తీసుకున్న ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇర్ప బాలాజీ అందుకున్నారు.ఈ అవార్డు కార్యక్రమానికి మణిపూర్, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్ర, కేరళ, కర్ణాటక,వంటి ఇరువై రాష్ట్రల నుండి ఈ అవార్డు అర్హత పొందిన వారు రావటం జరిగింది.

ఎస్సి, ఎస్టి సామజిక వర్గం లో గత కొంత కాలం నుండి రాజ్య హక్కు కోసం, డాక్టర్ బి అర్ అంబేద్కర్ ఆశయాలను కాపాడి , తెలియజేయుట,సామాజికంగా చైతన్య ఉద్యమాలు,క్రీడా, ఉచిత సేవా భావం వ్యక్తులను గుర్తుంచి ఎంపిక చేయటం జరిగింది.ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జీతేందర్ మను , సమతాసైనిక్ దళ్ రాష్టనాయకులు దుర్గం నగేష్ పాల్గొన్నారు.ఈ అవార్డు అందుకోవటం గుమ్మడిదొడ్డి గ్రామస్తులు, యువకులు, ఉద్యోగులు,బంధువు, మిత్రులు గర్విస్తూ అభినందనలు తెలియజేయటం జరిగింది.

# 60 ఏళ్ల ఆకాంక్ష నెరవేర్చిన సోనియాగాంధీ

**మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**ఇచ్చిన ప్రతి హామీలు అమలు చేస్తూ చూపుతాం**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి**




**తొలి సమయం ఎల్కతుర్తి, డిసెంబర్ 09**
ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల ఈ సందర్భంగా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ 60 ఏళ్ల ఆకాంక్ష స్వరాష్ట్ర తెలంగాణ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన మాట ప్రకారము తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం కృషి చేసినటువంటి సోనియా గాంధీ అని అన్నారు పక్క రాష్ట్రాల్లో అధికారం కోసం పాకులాడకుండా తెలంగాణ ఉద్యమంలో ఉన్నటువంటి న్యాయబద్ధమైన విషయాన్ని గ్రహించి తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది అమరులవుతున్న విద్యార్థుల యొక్క మరణాలను చూచి చెల్లించి స్వరాష్ట్రఏర్పాటు కృషి చేసిన వ్యక్తి సోనియా గాంధీ అని అన్నారు అలాంటి ఆకాంక్ష నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీని పట్టుకుని 9 సంవత్సరాలు పదవి వ్యామోహంతో అనుభవించినటువంటి బిఆర్ఎస్ అగ్ర నాయకత్వము ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం వారి విజ్ఞప్తికే అన్నారు ఏర్పడిన తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నటువంటి పథకాలను చూసి ప్రజలు సంతోష వ్యక్తం చేస్తున్నారు మహిళలకు ఉచితంగా రవాణా సౌకర్యము సన్న రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతి నిరుపేద కుటుంబానికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలని లక్ష్యంతో 10 లక్షల రూపాయల తో ప్రతి కార్పొరేట్ లో వైద్య సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుంది మహాలక్ష్మి పథకం కింద 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తు తో పాటుగా ప్రతి గృహానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నది అని అన్నారు ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ 180 కోట్లతో ఎలాంటి కులము మతము అనే భేదం లేకుండా నాణ్యమైన ఇంటర్నేషనల్ స్థాయిలో ఇంగ్లీష్ విద్య అందించాలనయే లక్ష్యంతో ముందుకు పోతుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చినటువంటి హామీల పాటుగా మేనిఫెస్టోలో అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్క హామీని త్వరలో నెరవేర్చబోతుందని గత ప్రభుత్వంలో చేసిన తప్పులను ప్రజా ప్రభుత్వం చేద్దామను ఉద్దేశంతో రైతులకు రైతుబంధు నూతన సంవత్సర కానుకగా ఎకరానికి 7500 రూపాయలు వృద్ధులు వితంతువులకు 4000 రూపాయలు వికలాంగులకు డయాలసిస్ పేషెంట్లకు 6000 రూపాయలు అందించబోతుందని ప్రతిపక్ష నాయకులు చేసే అబద్ధపు ఆరోపణ ప్రజలు నమ్మవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చి తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుఖినే సంతాజీ, ముప్పు మహేందర్,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గౌర్రె మహేందర్ పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్**
ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలి అని అన్ని శాఖల జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన 25 దరఖాస్తులను స్వీకరించి పరిష్కరానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి శాఖలో ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, సమస్యల పరిష్కారానికి సమయాను కూలంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం తర్వాత దరఖాస్తుదారునికి సమాచారం అందించాల్సినబాధ్యత ప్రతి అధికారిపై ఉందని స్పష్టం చేశారు.రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తులు పరిష్కరించిన వెంటనే ప్రజావాణి వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డిఓ మంగిలాల్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

## పురుషోత్తమాయా గూడెం శివారులో 80కేజీల ఎండు గంజాయి పట్టివేత

**తొర్రూర్ డిఎస్పీ కృష్ణ కిషోర్**



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 9:**
మానుకోట జిల్లా మరిపెడ సీ రోలు మండలం పురుషోత్త మాయ గూడెం శివారులో నిషేధిత 80 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు మరిపెడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తొర్రూర్ డి ఎస్పీ కృష్ణ కిషోర్ తెలిపారు అయన వివరాల ప్రకారం సుమారు రూ.20లక్షలు విలువచేసే 80కిలోల ఎండు గంజాయి, రవాణాకు వినియోగిస్తున్న టాటా మ్యాజిక్ ఆటోను అదుపులోకి తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరిసీతరామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం కు చెందిన కోర్ర నర్సింగ్, వంతల మోహన్ బాబు, వంతల సాదు అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని..వాహనం సీజ్ చేసిన పోలీస్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని సీలేరు లో కొనుగోలు చేసి తెలంగాణా రాజధాని హైదరాబాద్ కు తరలించే క్రమంలో పురుషోత్తమాయగూడెం శివారులో అదుపులోకి తీసుకున్నారు.

# విశాఖ డెయిరీపై ఆడిట్ జరగాల్సిందే

**శాఖ డెయిరీని**

**పరిశీలించిన ప్రత్యేక హౌస్ కమిటీ**

**విశాఖ, డిసెంబర్9:** విశాఖ డెయిరీలో అవకతవకలపై ఏర్పాటైన అసెంబ్లీ సభా సంఘం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో, సభ్యులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, గౌతు శిరీష, ఆర్ వి ఎస్ కెకె రంగారావు, దాట్ల సుబ్బరాజు, బొండా ఉమామహేశ్వరరావు ఈ ఉదయం విశాఖ చేరుకున్నారు. బస చేసిన హెూటల్ నుంచి అందరూ విశాఖ డెయిరీ చేరుకున్నారు. అధికారులతో కలిసి విశాఖ డెయిరీని ప్రత్యక్షంగా పరిశీలించారు. సుమారు ముడు గంటలు డైయిరీ పై సమీక్ష నిర్వహించారు. అలాగే జిల్లా అధికారులతో సభ సంఘం సమీక్ష నిర్వహించింది.విశాఖ డెయిరీ పరిశీలించిన అనంతరం సభా సంఘం చైర్మన్ జ్యోతులు నెహ్రూ మీడియాతో మాట్లాడారు. స్పీకర్ ఆదేశాలతోనే విశాఖ డెయిరీ పరిశీలించామన్నారు. పరిశీలన తరవాత మా సందేహాలు మరింత పెరిగాయన్నారు. వీటి మీద ఒక నిపుణుల కమిటీ వేయాలని తెలిపారు. అలాగే విశాఖ డెయిరీ మీద ఆడిట్ జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. తమ పరిశీలన సమయంలో విశాఖ డెయిరీ చైర్మన్ హాజరు కాలేదని, కేవలం ఎండీ మాత్రమే పాల్గొన్నారని వెల్లడించారు. విశాఖ డెయిరీ నాలుగు జిల్లాలో పరిధిలో ఉంది కనుక నాలుగు జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామన్నారు. పాడి రైతులకు నష్టం జరగకుండా నిర్ణయం తీసుకుంటామని వివరించారు. కమిటీ నివేదికను అసెంబ్లీకి అందిస్తామని జ్యోతుల నెహ్రూ తెలిపారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్పీకర్ ఆదేశాలతో విశాఖ డెయిరీ పై హౌస్ కమిటీ వేశారన్నారు. ఇప్పటిదాక విశాఖ డైరీ మీద అనేక అనుమానాలు సందేహాలు ఉన్నాయని, కానీ ఇక్కడకు వచ్చాక ఆ సందేహాలు మరింత పెరిగాయని వెల్లడించారు. పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారని చెబుతున్నారు, యాజమాన్యం మాత్రం అదేమీ లేదని చెప్తోందని తెలిపారు. విశాఖ డైరీ ని కమిటీ మరో సారి పరిశీలిస్తుందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. విశాఖ డెయిరీ ముందు నిరసన చేస్తున్న కార్మికులను సభా సంఘం సభ్యులు పలకరించారు. వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కార్మికులకు సంఘీభావం ప్రకటించారు.

# పేదోళ్లకు వెలుగులు పంచే లక్ష్యం వైపు అడుగులు

**తొర్రూర్ పాలకుర్తి పేద మధ్య తరగతి ఆరోగ్యానికి పెద్ద పీఠం**

**కాంగ్రెస్ పునాది ఆలోచనకు తుదిమెరుగులు**

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి. రాజేందర్ ఝాన్సీ రెడ్డి**



**తొలి సమయం తొర్రూర్ డిసెంబర్ 9 :** పాలకుర్తి, తొర్రూరుకు ప్రభుత్వ వైద్యానికి ఇక మహార్దశే అని నిరూపిస్తోంది శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి, గత పాలకులు 100 పడకల వస్తోంది. అంటూ మాటలకు పరిమితమై ప్రభుత్వ వైద్యాన్ని అందని ద్రాక్ష పండును చేశారు.. అర్ధరాత్రి అపరాత్రి వేళల్లో ప్రజలు ఆరోగ్య సమస్యల్లో వరంగల్లు మహబూబాబాద్ సివిల్ హాస్పిటల్స్ ను అన్నమో!రామచంద్ర అంటూ నిరాశ నిట్టూర్పులతో ఆశ్రయించేవారు.. చివరికి వైద్యం అందక ప్రాణాలు వదిలిన పరిస్థితి. కానీ గత పాలకులకు భిన్నంగా.. బడుగు బలహీనుల మధ్యతరగతి కుటుంబాల దైన్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నారు ఎమ్మెల్యే యశస్వినీ ఝాన్సీ రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి గతం వేరు ఇప్పుడు నిజం అనే నినాదంతో తొర్రూరు పాలకుర్తి పేద మధ్య తరగతి ప్రజలకు మేమున్నామాంటూ మరో అడుగు వేషారు. సోమవారం రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ ను నియోజకవర్గంలోని సమస్యలను ఏకరు పెట్టారు. గత పాలకులు చెప్పిన మాటలను చేయకుండా వదిలేసిన సమస్యలకు కార్యరూపంలో చెయ్యాలని విన్నవించారు, వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి స్పందించి తొర్రూర్ కు 100పడకలు, పాలకుర్తికి 50పడకలు మంజూరి చేశారు.. కాంగ్రెస్ పార్టీ పునాది ఆలోచనకు నియోజకవర్గం లో దారి సుగమం కావడానికి సహకరించిన ఆరోగ్యశాఖ మంత్రికి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి. మరియు రాజేందర్ ఝాన్సీ రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆదర్శ కమ్యూనిస్టు మాదాల



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ :**
పార్లమెంట్ సభ్యునిగా సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన మాదాల నారాయణస్వామి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంద మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మాదాల నారాయణస్వామి 11వ వర్ధంతి సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలోని మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటు సభ్యులుగా రైతాంగం ప్రజల సమస్యలపై సభలో గొంతెత్తిన మాదాల నారాయణస్వామి దేశవ్యాప్తంగా జరిగినా అనేక ప్రజా పోరాటాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారని అన్నారు. పాలకవర్గ పార్టీల విధానాల మూలంగా దేశంలో పెరిగిపోతున్న పేదరికం నిరుద్యోగం ఆకలి చావులు వలసలు కుల వివక్షత మత విద్వేషాలను తీవ్రంగా నిరసించిన మాదాల అనేక నిర్బంధాలను సైతం ఎదుర్కొన్నాడని అన్నారు. రైతాంగ సమస్యలపై ముఖ్యంగా పొగాకు రైతులు, కూలి రెట్ల పెంపు కై,కార్మికుల హక్కుల కోసం మత్స్యకారుల సమస్యలపై ఇంకా ఎన్నో సమస్యల పోరాటాలు నిర్వహించారని అన్నారు. కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై సమస్యల ఉద్యమాలను మాదాల స్ఫూర్తితో నిర్వహించాలని ఆయన అన్నారు.ఆరు గ్యారంటీ లా అమలులో విఫలమై, రైతాంగానికి కార్మిక వర్గానికి వ్యవసాయ కూలీలకు యువజనులకు మహిళలకు ఇచ్చిన హామీలు విస్మరించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చు చేస్తుందని అన్నారు. మాదాల నారాయణస్వామి ఆదర్శ కమ్యూనిస్టుగా ఆర్థిక సామాజిక పరిస్థితులను ఆకలింపు చేసుకొని మరింత దృఢంగా ప్రజల్లో పనిచేయాలని కోరుకున్నాడని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ముంజంపల్లి వీరన్న మహబూబాబాద్ డివిజన్ సహాయ కార్యదర్శి బిల్లా కంటి సూర్యం కే సముద్రం సయుక్త మండలాల కార్యదర్శి పైండ్ల యాకయ్య తో పాటు మంగ్యా,రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 60 సంవత్సరాల తెలంగాణా కల నెరవేర్చిన ఘనత సోనియా గాంధీదే

**జిల్లా కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షులు ఘనపురం అంజయ్య**



**తొలి సమయం డిసెంబర్ 9:**
60సంవత్సరాల తెలంగాణా కల సాకరం చేసిన ఘనత సోనియా గాంధీ కే దక్కింది అని కాంగ్రెస్ జిల్లా అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురం అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఘనపురం అంజయ్య ఆధ్వర్యంలో ఘనంగా సోనియా గాంధీ గ 79 వ జన్మదిన వేడుకలు జరిగాయి ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియా గాంధీ పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉన్నది అన్నారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక బిజెపి టిఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు అన్నారు ఒకసారి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలి అన్నారు తెలంగాణ ఇచ్చినటువంటి కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకొని రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతూ గత పాలకులు ఈ రాష్ట్రాన్ని విస్మరించారు అన్నారు సంవత్సరం కాలంలోనే అనేకమైన సంక్షేమ పథకాలను, వివిధ ఉద్యోగ నోటిఫికేషన్ లను విడుదల చేసారు అన్నారు ఎంతోమంది నిరుద్యోగుల నుంచి మేధావుల నుంచి ఉద్యమకారుల నుంచి మన్ననలు మ కాంగ్రెస్ ప్రభుత్వం పొందుతుంది అన్నారు తెలంగాణ రాష్ట్రంలో మలిదశ ఉద్యమంలో మానుకోట ఉద్యమ నాయకులు క్రియా శీలక పాత్ర పోషించారు అన్నారు వారందరూ కూడా రాబోయే రోజుల్లో ఇక్కడున్నటువంటి ప్రజాప్రతినిధులతోని చర్చించి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి వారందరికీ సముచిత స్థానం కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి ఆరుద్ర వెంకటేశ్వర్లు టీపీసీసీ ఓబీసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పింద్రాల రామదాస్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అజ్మీర సురేష్ మహిళా మండల ప్రెసిడెంట్ స్వర్ణలత టౌన్ ప్రధాన కార్యదర్శి బండారు చిరంజీవి ఐ ఎన్ టి యు సి టౌన్ అధ్యక్షులు మాదంటి శ్రీనివాస్ టౌన్ ఉపాధ్యక్షులు బట్టు దేవ్ సింగ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతన్ రామరాజు సిరిపురం వీరన్న ఆవుల సతీష్ నాసర్ ప్రభాకర్ బండి వెంకన్న నల్ల మాస రవీందర్ దండం వెంకన్న మహిళా నాయకురాలు సత్య మనోరమ బ్లాక్ అధ్యక్షురాలు భూక్య విజయలక్ష్మి లక్ష్మి దేవి పొన్నబోయిన మాధవి అంబాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన తల్లి సోనియమ్మ

**వరంగల్ నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న-మురళీ గౌడ్**

**వరంగల్ నగరంలో ఘనంగా సోనియమ్మ జన్మదిన వేడుకలు**



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 9:**
తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన తల్లి సోనియమ్మ అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియా గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ వరంగల్ నగర మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్నమురళి గౌడ్ అన్నారు. వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ లో సోనియా గాంధీ 78వ జన్మదినాన్ని పురస్కరించుకొని గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నారగోని స్వప్న-మురళీ గౌడ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది అమరుల బలిదానాలు చూసిన తెలంగాణ దేవత సోనియా గాంధీ తన జన్మదినం సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందని, ఆమె జన్మదినం సందర్భంగా వాడవాడలా కేక్ కటింగ్ తో పాటు మహా అన్నదానాలు నిర్వహించామని నగర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి గౌడ్ తెలిపారు.

## డిసెంబర్ 11 మాటేడులో జిల్లా స్థాయి
# గణిత టాలెంట్ టెస్ట్



**తొలి సమయం మహబూబాబాద్ డిసెంబర్ 9:**
డిసెంబర్ 11వ తేదీన తొర్రూరు మండలంలోని మాటేడు లో జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలంగాణా గణిత ఫోరం ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలిపింది.. వివరాల్లోకి వెళితే.. జిల్లా శాఖ గణిత ఫోరమ్ మరియు ఏం ఈ ఓ ఏ రవీందర్ రెడ్డి ఆదేశాను సారంగా మండల స్థాయిలలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు పొందిన విద్యార్థిని విద్యార్థులను వారి వారి పాఠశాలలోని గణిత ఉపాధ్యాయుల ద్వారా పంపించాలి, అని డి ఈ ఓ ఆదేశించారు అని తెలిపారు. టిఎంఎఫ్ మండలం శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మీ మండలస్థాయిలో గెలిచిన విద్యార్థిని విద్యార్థులను వారి గైడ్ తోటీచర్ తో సహా హాజరు అయ్యేవిధంగా జిల్లా శాఖ సన్నాహకసమావేశం లో కోరనైనది అన్నారు , కనుక మాటేడు లో జరగబోయే జిల్లా గణిత టాలెంట్ టెస్టులో పాల్గొనే విద్యార్థులకు సహకరించాలని. రాష్ట్ర గణితఫోరమ్ కోరుకుం టుంది అన్నారు.ఈ కార్యక్రమంలో గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు తాదూరి మాధవాచారి, దుబ్బాక శ్రీధర్ రెడ్డికోశా ధికారి రామ సహాయం శ్రీధర్ రెడ్డి కౌన్సిల్ సభ్యులు మిరియాల సతీష్ రెడ్డి కాసం శ్రీనివాసరావు, సురేష్ కుమార్ మచ్చ సోమయ్య ఉపాధ్యక్షులు మద్ది లింగమూర్తి మండల అధ్యక్షులు తండా సదానందం కుందూరు అనిల్ కుమార్రెడ్డి నట్టే రవి తదితరులు పాల్గొన్నారు.

# మొగుళ్ళపల్లిలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 9 :**
కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇందిరమ్మ రాజ్య నమూనా ఉంటుందని,ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ప్రభుత్వాన్ని అందించారని కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అన్నారు. సోమవారం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని బస్టాండులో ఆకుతోట కుమారస్వామితో సహా పలువురు నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆకుతోట కుమారస్వామి మాట్లాడారు. తన సొంత పార్టీ వాళ్లు కాదన్న కూడా ధైర్యంగా ముందుకు వచ్చి, పార్లమెంటు తలుపులు మూసి, తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే..కుటుంబ పాలనతో పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసి, దుర్మార్గపు నియంత పాలన చేశారన్నారు. దుర్మార్గపు పాలనకు విసిగివేసారిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని కాంగ్రెస్ ను గెలిపించారన్నారు. సబ్బండ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, ఎదగాలనే ఉద్దేశం గల సోనియా గాంధీ ప్రోద్బలంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన అద్భుతంగా కొనసాగుతుందని, ఇచ్చిన గ్యారెంటీలన్నీ అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆకుతోట కుమారస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, మొగుళ్ళపల్లి టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, పోతుగల్లు మాజీ ఉపసర్పంచ్ ఆరెల్లి వీరన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విజయసాయిరెడ్డి పద్ధతిగా మాట్లాడాలి

**ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత**

**అమరావతి, డిసెంబర్9:** చేసిన తప్పులు బయటపడుతు న్నాయనే భయంతో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఏపీ హెూం మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. స్థాయి, వయసు మరిచిపోయి చిల్లరగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. చంద్రబాబును విమర్శించినా... తమకు, పవన్ కల్యాణ్ కు మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నించినా విజయసాయిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. పద్ధతిగా మాట్లాడాలని హితవు పలికారు. తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసుకోవాలని విజయసాయి ధైర్యంగా చెప్పాలని అనిత అన్నారు. ఆయనపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

## మాజీ సర్పంచ్ ల ముందస్తు అరెస్టు



**తొలి సమయం, తిమ్మాపూర్ డిసెంబర్ 09**

తిమ్మాపూర్ మండలం లోని మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్టు అన్యాయం అని మాజీ సర్పంచ్ ల సంఘం రాష్ట్ర నాయకులు మేడి అంజయ్య అన్నారు. మండలంలోని మన్నెంపల్లి, మల్లాపూర్, నేదునూర్,నూస్తులాపూర్ మాజీ సర్పంచ్ లు మేడి అంజయ్య, మామిడి సతీష్,వడ్లూరి శంకర్, రావుల రమేష్ లను అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయినందున గతంలో అసెంబ్లీ ముట్టడి కి పిలుపు మేరకు ముందస్తు అరెస్టు చేశారని విధి నిర్వాహణలో అనేక బాధలు భరించిన సర్పంచ్ లకు బిల్లులు చెల్లించకుండా అరెస్టు లు చేయడం అన్యాయం అని మాజీ సర్పంచ్ లు తెలిపారు

## అల్గునూర్‌లో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు




**తొలి సమయం తిమ్మాపూర్ డిసెంబర్ 09**

తిమ్మాపూర్ మండలం అలుగునూర్ చౌరస్తాలో సోమవారం సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొరపల్లి రమణారెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎల్ గౌడ్, పార్టీ ఆఫీస్ ఇన్చార్జ్ గోపు మల్లారెడ్డి, డివిజన్ అధ్యక్షులు రమేష్ ,నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, పోలు రాము, బండారి రమేష్, నగునూరి శ్రీనివాస్, మామిడి నరేందర్ రెడ్డి, కాల్వ మల్లేశం, శ్రీకాంత్, సంఘం శ్రీనివాస్, లక్ష్మీనారాయణ రెడ్డి ,కంది అశోక్ రెడ్డి, సమద్ ,ఆశిక్ భాష, శ్రీనివాస్ యాదవ్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

### ఆగ్నేయ బంగాళాఖాతంలో

## ఏర్పడిన అల్పపీడనం

**మరో 24 గంటల్లో బలపడే అవకాశం**

**కోస్తా, రాయలసీమలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు**

**అమరావతి, డిసెంబర్9:** ఆగ్నేయ బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం మీద అల్పపీడన ప్రాంతం, దాని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్రానికి 5.8 కి.మీ.ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ, వచ్చే 24 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణించి, ఆ తర్వాత డిసెంబర్ 11వ తేదీ నాటికి నైరుతి బంగాళాఖాతం వద్ద శ్రీలంక-తమిళనాడు తీరాలకు చేరుతుందని అధికారులు తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతంలోని అల్పపీడనం ప్రభావంతో ఏపీలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు,నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కోస్తా, రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలలో ఉంచాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని తెలిపింది. ఉదయం వేళల్లో పొగమంచు ఉండే అవకాశం ఉంది. నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం లేదా చినుకులు పడే ఛాన్స్ ఉంది. హైదరాబాద్ లో గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.

## మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్

**ముంబై, డిసెంబర్9:** మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. వరుసగా రెండోసారి ఆయన ఆ పదవికి ఎన్నికయ్యారు. స్పీకర్ పదవి కోసం ఆయన ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, డిప్యూటీలు అజిత్ పవార్, ఏకనాథ్ షిండే, ఇతర బీజేపీ నేతలు ఆయనకు సపోర్టు ఇచ్చారు. స్పీకర్ పోస్టు కోసం మహా వికాశ్ అగాధీ కూటమి నామినేషన్ దరఖాస్తు చేయలేదు. ప్రతిపక్ష నేత ఎన్నిక అంశంలో స్పీకర్ నర్వేకర్ పాత్రపై అందరి దృష్టి ఉన్నది. అసెంబ్లీలో ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీకి 10 శాతం కన్నా తక్కువ సీట్లు ఉన్నాయి. దీంతో ప్రతిపక్ష నేత హోదాను ఇస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# 60ఏండ్ల కలను సాకారం చేసిన దేవత సోనియా గాంధీ

**ఆమె రుణం తీర్చడానికి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు**

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి - ఘనంగా నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు**




**తొలి సమయం కరీంనగర్**

60 ఏళ్ల కల నెరవేర్చిన అభివృద్ధి ప్రదాత సోనియా గాంధీ అని, ఆమె ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ చౌక్ లో భారీ కేక్ ను కోసి పంచిపెట్టారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ..సోనియా గాంధీ జన్మదినం తెలంగాణ ప్రజలకు ఒక పండుగ అని అన్నారు. డిసెంబర్ 9, 2009లో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని ఉక్కు సంకల్పంతో సోనియమ్మ తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని అన్నారు.తెలంగాణ ప్రజలు కృతజ్ఞత భావంతో ఉంటారని గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల తీర్పుతో నిరూపించారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించారన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలదని.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు తెలంగాణ కల సహకారం చేసిన సోనియా గాంధీ జన్మదినాన్ని ఒక పండగలా జరుపుకుంటున్నామన్నారు.తెలంగాణ ప్రజల పాలిట ఆమె దేవత అని కొనియాడారు.ఆమె జన్మదినం సందర్భంగా నగరంలో చాలా ప్రాంతాలలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని నరేందర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్,సెల్స్ అధ్యక్షులు ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,సమద్ నవాబ్,ఆకారపు భాస్కర్ రెడ్డి,కార్పొరేటర్లు బుచ్చి రెడ్డి,గంట కల్యాణి,ఆర్ష మల్లేశం, ఆకుల నర్సయ్య,నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి,మెతుకు కాంతయ్య,షబానా మహమ్మద్, ముల్కల కవిత,జ్యోతి రెడ్డి, ఊరడి లత,రజితా రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి ఘన విజయం

**3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపు**

**అమరావతి, డిసెంబర్9:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎస్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి ఘన విజయం సాధించారు. బొర్రా గోపిమూర్తి తన సమీప అభ్యర్థి గంధం నారాయణ రావుపై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.ఆయన మొదటి ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. ఆయనకు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ 4న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన పోలింగ్ డిసెంబర్ 5న జరిగింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో మొత్తం 116 పోలింగ్ కేంద్రాల్లో 16,737 ఓట్లకు గానూ, 15,494 (92.62 శాతం) ఓట్లు పోలైయ్యాయి.ఓట్ల లెక్కింపు ప్రక్రియ కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ)లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో జరిగింది. 14 టేబుల్స్‌పైన తొమ్మిది రౌండ్లలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి చేశారు. 15,494 ఓట్లకు గాను ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి (9,165 ఓట్లు) తన సమీప అభ్యర్థి, ఎస్‌టీయూ బలపరిచిన గంధం నారాయణ రావు (5,259)పై 3,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇతర అభ్యర్థులు పులుగు దీపక్‌కు 102, నామన వెంకట లక్ష్మీకి 81, కావల నాగేశ్వరరావుకి 73 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో భారీగా చెల్లని ఓట్లు పడ్డాయి. చెల్లని ఓట్లు 814 పడ్డాయి. ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికల్లో చెల్లని ఓట్లు భారీగా పడటంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సరిగా ఓట్లు వేయలేకపోతున్నారని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. 2021లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన షేక్‌సాబ్జీ కంటే, ఇప్పుడు గెలుపొందిన బొర్రా గోపిమూర్తి మెజార్టీ ఎక్కువగా నమోదు అయింది. ఆ ఎన్నికల్లో 17,467 ఓట్లకు 16,054 ఓట్లు పోలయ్యాయి. అందులో యూటీఎఫ్ తదితర సంఘాలు బలపరిచిన షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు వచ్చాయి. ఆయన తన సమీప అభ్యర్థి, వైసీపీతో పాటు, పీఆర్‌టీయూ మద్దతిచ్చిన గంధం నారాయణరావు (6,453 ఓట్లు)పై 1,534 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పుడు టీడీపీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి చెరుకూరి సుభాష్ చంద్రబోసుకు 106 ఓట్లు, బీజేపీ మద్దతు ఇచ్చిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు వచ్చాయి. అప్పుడు 363 ఓట్లు చెల్లని నమోదు అయ్యాయి. ఈసారి ఓట్లు తగ్గినప్పటికీ మెజార్టీ పెరిగింది. మెజార్టీ 3,906 ఓట్లకు పెరిగింది. మరోవైపు రెండుసార్లు ఓటమి చెందిన గంధం నారాయణరావుకు పోలైన ఓట్ల సంఖ్య తగ్గింది. కాగా సంఘం నిర్ణయం మేరకు వాలంటీర్ రిటైర్మెంట్ తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశానని ఎమ్మెల్సీగా ఎన్నికైన గోపిమూర్తి తెలిపారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాల్లో వలె విద్యారంగంలో ఉన్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, జెఎల్ ప్రమోషన్,అందరికీ హెల్త్ కార్డులు, ఐటీడీఏ పాఠశాలల్లో అప్ గ్రేడేషన్, జీవో నెంబర్ 3 అమలు, మున్సిపల్, ఎయిడెడ్ టీచర్ల సమస్యలు, ఎయిడెడ్ పాఠశాలల పోస్టుల భర్తీ, మోడల్ స్కూల్స్, కేజీబీవీ టీచర్ల సమస్యలు తదితర సమస్యల సాధనకై పీడీఎఫ్ ఎమ్మెల్సీలతో కలిసి భవిష్యత్తులో పోరాటం చేస్తానని అన్నారు.

# టీడీపీలో కలకలం సృష్టిస్తోన్న యనమల లేఖ

**- కాకినాడ సెజ్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు - కేవీ రావు చౌదరిపై విమర్శలు చేస్తూ లేఖ**

**- వైసీపీని కూడా వదలని రామకృష్ణుడు - అరబిందోకి రూ.4,000 కోట్లకు కొనుగోలు చేశారాణి ఆరోపణ**



**అమరావతి, డిసెంబర్9:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు లేఖాస్త్రాం సంధించారు. ప్రస్తుతం ఈ లేఖ టీడీపీలో కలకలం సృష్టిస్తోంది. కాకినాడ సెజ్ లక్ష్యంగా ఆయన లేఖ ఉంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు సన్నితంగా ఉన్న కేవీ రావు చౌదరిపై విమర్శలు చేస్తూ.. లేఖలో అనేక అంశాలు పేర్కొన్నారు. ఈ లేఖపై టీడీపీ అధికారికంగా స్పందించలేదు. కాకినాడ సెజ్ పెద్ద షాట్లు (కంపెనీలు) ప్రయోజనాలను పొందాయి. బీసీ, చిన్న రైతులు, మత్స్యకారుల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేయడం లేదా భూసేకరణ చేయడం దీనికి కారణమని విమర్శించారు. కాకినాడ ఓడరేవు సొంత చేసుకున్న కేవీ రావు చౌదరికి చెందిన బడా కంపెనీలు.. కాకినాడ సెజ్‌లో భూమిని తక్కువ ధరలకు పొందాయి. ఆ భూమిని జీఎంఆర్ (వైశ్య)కి కె.వి రావు చౌదరి వందల కోట్లకు అమ్మారు. ఆ తరువాత అరబిందో (జగన్మోహన్ రెడ్డి బినామీ)కి దాదాపు రూ.4,000 కోట్లకు కొనుగోలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం క్లెయిమ్ చేసిన భూమిని దివీస్ (మురళీ చౌదరి)తో సహా పరిశ్రమలను స్థాపించడానికి రూ.500 కోట్లు ఇచ్చారు. కోన అటవీ వాసులకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించకుంటే, వారి వాస్తవ సమస్యల కోసం నిరంతరం పోరాడుతామని, వారి జీవనోపాధిని కాపాడేందుకు వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని యనమల కోరారు. చెన్నైలోని ఎన్‌జీటీ, సీఎంఎస్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ పొల్యూషన్ బోర్డుకు లేఖలు రాశాను. ఇవి చర్య తీసుకోవడానికి స్వతంత్ర సంస్థలుగా పరిగణించబడతాయి. కానీ వాస్తవానికి రాజకీయ నియంత్రణలో ఉంటాయి. పరిష్కరిస్తారా? లేదా? అనేది ప్రభుత్వాల ముందు ఉంది.ప్రభుత్వం తమకు అనుకూలంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు. కాకినాడ సెజ్‌లోని కొన్ని భూములను మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వంటి స్థానిక వైసీపీ నాయకులు బలవంతంగా తీసుకున్నారు. ఆ భూములను డి-నోటిఫికేషన్ చేసిన తర్వాత భూ సేకరణ అసలు భూ యజమానులకే దక్కాలి. కానీ వైసీపీ ప్రభుత్వంలో అది జరగలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తమ నాయకులకు అనుకూలంగా మొత్తం ఫ్రాడ్ చేసారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధం. అలాగే ఇది భూసేకరణ చట్టం స్ఫూర్తికి విరుద్ధం. దీనిపై విచారణ అవసరం. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం ఆ భూములను అసలు రైతులకు ఇవ్వాలి. కాకినాడ సెజ్ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి. అలాంటి భూములను అసలు భూ యజమానులకు అప్పగించాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో న్యాయం కోసం ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం. స్థానికులను రక్షించేందుకు మీడియా ముందుకు వస్తామన్నారు. ఎలాంటి తీవ్ర ఆందోళనలు జరగకుండా ఉండేందుకు ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, ఎన్‌జీటీ ప్రతినిధి, రాష్ట్ర, జిల్లా అధికారులతో అధికారిక కమిటీని ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను పరిష్కరించడానికి వారు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. లేదంటే ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు,. కేవీ రావు కూడా కాకినాడ సెజ్‌లో నష్టపోయిన వారికి న్యాయం చేయలేదు. వంద కోట్ల నుంచి వెయ్యి కోట్ల వరకు ఆయన (కేవీ రావు) ఆర్జించి, బాధితులకు కొద్ది మొత్తమే ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ధనికులు (ప్లూటోక్రాట్లు) లాభపడుతుండగా, బలహీన వర్గాలు (పేదలు) సంపద సృష్టిలో, రాజకీయాల్లో పాల్గొనడంలో, అభివృద్ధి ముసుగులో నష్టపోతున్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101